
సాక్షి
బాపట్ల
మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



కలెక్టర్‌ను కలసిన పరిశీలకురాలు

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ పరిశీలకురాలు వి.కరుణ సోమవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి ఎన్నికల నిర్వహణపై చర్చించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 544.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,040 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ముగిసిన బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేటలోని శ్రీహంపి పీఠపాలిత శ్రీగంగామీనాక్షి సోమసుందరేశ్వరాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. హోమం నిర్వహించారు.

అన్నదాతలు రోడ్డుపాలు

వాడరేవు– పిడుగురాళ్ల జాతీయ రహదారి పనులు వేగంగా సాగుతున్నా, భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం మరింత జాప్యం చేస్తోంది. రోడ్డు కోసం వందలాది మంది రైతులు భూములిచ్చారు. ఇందులో ఇప్పటికీ సగం మందికి కూడా పరిహారం అందలేదు. ఎప్పుడిస్తారో కూడా అధికారులు చెప్పడం లేదు. సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి కావస్తున్నా పరిహారం అందకపోడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- జాతీయ రహదారికి భూములిచ్చి రైతులకు కష్టాలు
- పరిహారం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- నిధులున్నా పంపిణీలో జాప్యం
- సాకులతో అధికారులు కాలయాపన



నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలోని సముద్ర తీరంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా వాడరేవు (చీరాల సముద్ర తీరం) మారింది. అక్కడ నుంచి తెలంగాణకు అనుసంధానంగా పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు గత ప్రభుత్వంలో ప్రారంభమై, వేగంగా సాగుతున్నాయి. వాడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు 167/ఏ జాతీయ రహదారిని నేషనల్ హైవే అధికారులు రెండు భాగాలుగా విభజించారు. ఒకటి వాడరేవు నుంచి చీరాల, కారంచేడు, పర్చూరు మండలాల మీదుగా చిలకలూరిపేట వరకు విస్తరిస్తున్నారు. రెండోదాన్ని చిలకలూరిపేట నుంచి నర్సరావుపేట, నకరేకల్లు మీదగా పిడుగురాళ్ల వరకు నిర్మిస్తున్నారు. మొదటి భాగంలో రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

నిబంధనలకు పాతర

జాతీయ రహదారుల కోసం భూముల కోల్పోయిన రైతులకు నిబంధనల మేరకు పరిహారాన్ని త్వరగా అందించాలి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) నిబంధనల మేరకు ఇబ్బందులు లేకుండా చూడాలి. ఇవేమీ పట్టవన్నట్లు అధికారులు, కాంట్రాక్టర్లు వారి పని చేసుకుపోతున్నారు.

రైతులకు సాగునీటి ఇబ్బందులు

రోడ్డు నిర్మాణంతో చీరాల–కారంచేడు–పర్చూరు మండలాల మధ్య పొలాలకు సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు 3,000 ఎకరాలకు నీరందించే సాగునీటి పంట కాలువల పైన, మురుగు, వరద నీరు ప్రవహించేలా ఉండే పులక కాలువల పైన అండర్‌పాస్‌లు లేదా తూములు ఏర్పాటు చేసి రహదారులు నిర్మించాలి. రోడ్డు డిజైన్ చేసినప్పుడు ఈ విషయాలేమీ పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల ఇప్పుడు సమస్య ఏర్పడింది. దీంతో ఈ ప్రాంత రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు.రోడ్డు పనులకు వినియోగిస్తున్న టిప్పర్లను సైతం నిలిపివేసినా అధికారుల్లో చలనం లేదు. తూములు వేయకుండా రోడ్డు వేస్తే పంటలకు సాగునీరు అందదని, వరదల సమయంలోనూ నీరు బయటకు పోయే వీల్లేక పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు.

పరిహారం మంజూరులో జాప్యం

రహదారి నిర్మాణానికి వాడరేవు నుంచి చిలుకలూరిపేట వరకు రైతులు పొలాలను ఇచ్చారు. మొదటి విడతలో చీరాల, కారంచేడు, పర్చూరు మండలాల పరిధిలో 63.87 హెక్టార్ల భూమిని సేకరించారు. 158 మంది రైతులకు గానూ రూ. 2.24 కోట్లు చెల్లించాలి. ఇందులో గతంలో 90 శాతం మందికి పరిహారం చెల్లించారు. మిగిలిన పది శాతం రైతులకు ఇంకా అందలేదు.

■ రెండో విడతలో వేటపాలెం, చీరాల, కారంచేడు, పర్చూరు మండలాల పరిధిలో 112 మంది రైతుల నుంచి 25.64 హెక్టార్ల భూమిని సేకరించారు. దీనికి గానూ రూ. 123 కోట్లు చెల్లించాలి. పరిహారం పంపిణీలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



కారంచేడు వద్ద రహదారి కోసం రైతులు కోల్పోయిన సాగు భూమి

పరిహారం కోసం ఎదురుచూపులు



నాకు కారంచేడు ఉత్తర పొలాల్లో సర్వే నంబర్ 810/3లో 92 సెంట్ల సాగుభూమి ఉంది. రహదారి కోసం అందులో 42 సెంట్లను తీసుకున్నారు. నాకు స్థానిక ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. నేషనల్ బ్యాంక్ ఖాతా ఇవ్వాలని చెబితే మరుసటి రోజే స్టేట్‌బ్యాంక్ ఖాతాను సమర్పించాను. ఇప్పటికీ నష్టపరిహారం కింద రూ. 8.40లక్షల నగదు నా ఖాతాకు జమ కాలేదు. పలుమార్లు అధికారులను కలసినా ప్రయోజనం లేదు.

–మండల రామదాసు, రైతు, కారంచేడు

పట్టించుకోని అధికారులు



మా అత్తగారికి చెందిన సర్వే నంబర్ 500/1బీలో 1.11 ఎకరాలు, 500/2బీలో 0.20 సెంట్లు భూమిని రోడ్డు నిర్మాణానికి తీసుకున్నారు. నష్టపరిహారంగా రూ 11.63లక్షలు, రూ 8.87లక్షలు చొప్పున మొత్తం రూ. 20.50 లక్షలు ఇవ్వాల్సి ఉంది. తొలి విడతలోనే భూములు సేకరించినా ఇంత వరకు నగదు జమ చేయలేదు. తహసీల్దారు, ఆర్డీఓకి అర్జీలు ఇచ్చాం. కలెక్టర్ గ్రీవెన్స్‌లో కూడా ఇప్పటి దాకా ఐదు సార్లు అర్జీలు ఇచ్చాను. అంతా సక్రమంగానే ఉందని చెబుతున్నారు కానీ నగదు మాత్రం ఇవ్వడం లేదు. భూములు తీసుకుని సంవత్సరం పైగా అయింది. పంట నష్టం కూడా ఇంత వరకు ఇవ్వలేదు.

–యార్లగడ్డ సోమశేఖర్, రైతు, కారంచేడు

నులి పురుగుల నివారణతో పిల్లలకు మేలు

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్



చెరుకుపల్లి: పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల కోసం నులి పురుగుల నివారణ అవసరమని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కావూరు బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కడుపులో నులి పురుగులు పెరగడం వల్ల పిల్లలు శారీరక, మానసికంగా బలహీనపడతారని, నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు బాలబాలికలు ఆల్బెండజోల్ మాత్రలు ఏడాదికి రెండుసార్లు తీసుకోవాలని ఆమె సూచించారు.ఈ సందర్భంగా చేతులు శుభ్రతపై విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య రూపకం ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం జేసీ ప్రకర్ జైన్, వైద్యాధికారులు బాలికలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలోఆర్డీఓ రామలక్ష్మి, డీఈఓ ఎస్.పురుషోత్తం, తహసీల్దార్ సీహెచ్. పద్మావతి, కావూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సాలేహాజుబేద్, డాక్టర్ అబ్దుల్ సమ్మద్, ఆర్ఐ మౌనిక, పాఠశాల ప్రిన్సిపాల్ పి. నాగమణి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1818 క్యూసెక్కుల విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 0 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 156 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 170 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 125 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 80 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 900 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

శ్రీలక్ష్మీ నరసింహస్వామికి ఆభరణాల బహూకరణ



చెరుకుపల్లి: గూడవల్లిలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి గ్రామానికి చెందిన పలువురు ఎన్ఆర్ఐలు, గ్రామస్తులు సోమవారం బంగారు, వెండి ఆభరణాలు బహూకరించారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు కోటా సాంబశివరావు, కోటా వంశీకృష్ణ కలసి రూ 1.13 లక్షల విలువైన 13 గ్రాముల బంగారు లాకెట్, మరో ఎన్ఆర్ఐ గోగినేని కృష్ణకాంత్ రూ.96 వేల విలువగల 10 గ్రాముల బంగారు చైను, గ్రామానికి చెందిన షిర్డీ సాయిబాబా భక్త బృందం రూ. 2.42 లక్షలతో అమ్మవారికి 27 గ్రాముల బంగారు హారం, అదే గ్రామానికి చెందిన వెలగపూడి రత్న ప్రకాష్ రూ. 26,500తో 188 గ్రాముల వెండి జంధ్యాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు బృందావనం ఫణికుమార్‌కు గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమగుండ పూజ నిర్వహించారు. స్వామికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బబ్బేపల్లి కొండ పరిశీలన



మార్టూరు: బాపట్ల జిల్లా అటవీ, రెవెన్యూ శాఖల మధ్య కొంతకాలంగా నడుస్తున్న వివాదం నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం బబ్బెపల్లి కొండ ప్రాంతాన్ని జిల్లా రెవెన్యూ, అటవీ, మైనింగ్ అధికారులు పరిశీలించారు. మార్టూరు మండలం బబ్బేపల్లి కొండ ప్రాంతమైన సర్వే నంబర్ 387 /సీ 11లోని 357.27 ఎకరాల భూమి తమ శాఖకు చెందిందంటూ అటవీ, రెవెన్యూ అధికారుల మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ వెంకట మురళి ఆదేశాలపై మూడు శాఖల అధికారులు కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆర్డీఓ గ్లోరియా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ అధికారి ఎల్. భీమన్న, వేటపాలెం, కూకట్లపల్లి ఫారెస్ట్ అధికారులు వెంకటేశ్వర్లు, రమేష్, తహసీల్దార్ ప్రశాంతి, మైనింగ్ సర్వే సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల సత్తా చూపిస్తాం



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి వలంటీర్ల సత్తా చూపిస్తామని, వలంటీర్లకు జరిగిన అన్యాయంపై చట్టసభల్లోనే ప్రశ్నిస్తానని విజయవాడకు చెందిన వలంటీర్ గంటా మమత అన్నారు. సోమవారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆమె నామినేషన్ పత్రాలను గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,60,000 మంది వలంటర్ల జీవితాలను కూటమి ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లందరూ ఐకమత్యంతో ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో వలంటీర్ల సత్తా ప్రభుత్వానికి చూపిస్తామని తెలిపారు.

93,597 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 84,278 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 93,597 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,700 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 65,583 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

మండలి రాజకీయ నిరుద్యోగులకు వేదిక కావొద్దు

- కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలి
- పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, బొర్రా గోపిమూర్తి
- గుంటూరులో నామినేషన్ వేసిన లక్ష్మణరావు



ర్యాలీలో పాల్గొన్న భారీ జన సందోహం

గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి రాజకీయ నిరుద్యోగులకు వేదిక కారాదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. శాసనమండలి కృష్ణా – గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ తరఫున కేఎస్ లక్ష్మణరావు సోమవారం నామినేషన్ వేశారు. గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ నిర్వహణ అనంతరం వందలాది మంది మద్దతుదారులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. ముందుగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా పోరాటాల ద్వారానే పాలకుల మైండ్‌సెట్ మార్చగలమన్నారు. అధికార పార్టీ నుంచి వచ్చిన వ్యక్తి ఎమ్మెల్సీగా మండలిలో అడుగుపెడితే ప్రజా సమస్యలను ప్రభుత్వాన్ని నిలదీయగలరా అని అన్నారు. మరో ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు సైతం రాజకీయపార్టీలు అభ్యర్థులను పోటీకి దింపడం తగదని, ప్రజల తరఫున గళం విన్పించగలిగే సత్తా గల నేతలే మండలిలో అడుగుపెట్టాలన్నారు. కూటమి పాలనలో హామీలను విస్మరించి, సమస్యలు పట్టి పీడిస్తున్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు సరైన తీర్పు ఇస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం , యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పోటీలో తనకు ఎదురుగా ఎవరున్నా భయపడే ప్రసక్తే లేదని అన్నారు. కృష్ణా–గుంటూరు జిల్లాల్లో ఉన్న 3.46 లక్షల గ్రాడ్యుయేట్ ఓటర్లు ఈనెల 27న జరిగే ఎన్నికల్లో చక్కటి తీర్పు ఇస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, జనసేన నాయకుడు చందు కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ, మెడికల్ రిప్రజెంటేటివ్స్, పాలిటెక్నిక్ కాంట్రాక్టు అధ్యాపకులు, సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంఘం, ఆవాజ్ తదితర ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు తమ మద్దతు ప్రకటించారు. సభ అనంతరం విజ్ఞాన మందిరం నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. సభతో పాటు ర్యాలీలో రెండువేలకు పైగా ఆయా వర్గాల ప్రతినిధులు, గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ నాయకుడు నర్రా శ్రీనివాసరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, జనవిజ్ఞానవేదిక నాయకులు పాల్గొన్నారు.



గుంటూరు కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

లేగ దూడల పెంపకంతో మంచి ఆదాయం

ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు



రైతుకు బహుమతి అందిస్తున్న సీఈఓ

బల్లికురవ: లేగ దూడలను మంచి ఆహారంతో సక్రమంగా పెంచితే మూడున్నరేళ్ల నుంచి పదేళ్లకు పైబడి ఏటా ఆదాయం పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అంబడిపూడి పశువైద్యశాలలో పశుసంవర్ధక శాఖ, డీఎల్‌డీఏ ఆధ్వర్యంలో సోమవారం మేలుజాతి లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ లేగదూడ రెండున్నరేళ్లకు ఎదకు వస్తుందని తెలిపారు. సకాలంలో టీకాలు, నట్టల నివారణ మందులు వేయించాలని చెప్పారు. ప్రదర్శనకు 56 దూడలు రాగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. దూడలన్నింటికీ మినరల్, మిక్చర్, వివిధ రకాల టానిక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో చంద్రశేఖర్, డీడీ రమేష్‌బాబు, హెచ్‌ఓ వేణుగోపాల్, ఉషా, స్థానిక వైద్యాధికారులు ఆర్.పావని కుమారి, పి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- మొత్తం 40 మంది 69 నామినేషన్లు
- చివరి రోజున 22 మంది అభ్యర్థుల నామినేషన్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలోని కృష్ణా – గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ముగిసింది. చివరిరోజున పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం ఒక్కరోజే 22 మంది అభ్యర్థులు 43 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఘట్టం ముగిసే సమయానికి 40 మంది అభ్యర్థులు 69 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన మంగళవారం ఉదయం 11 గంటలకు చేపడతారు. ఈ నెల 27న ఎన్నిక జరగనుంది. ప్రధానంగా పోటీ ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న కె.ఎస్.లక్ష్మణరావు, తెలుగుదేశం అభ్యర్థి ఆలపాటి రాజా మధ్య జరగనుంది. అన్ని రంగాల నుంచి పలువురు పోటీలో నిలబడ్డారు. కె.ఎస్.లక్ష్మణరావు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నారు. ఆయనకు వామపక్షాలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీ మద్దతు ప్రకటించారు. మరోవైపు జనసేన పార్టీకి చెందిన ఆయన పూర్వ విద్యార్థులు కూడా వచ్చి సంఘీభావం ప్రకటించి, సన్మానించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వలంటీర్లను కూటమి ప్రభుత్వం మోసం చేసిన నేపథ్యంలో కృష్ణా జిల్లా నుంచి వలంటీరు ఒకరు బరిలో నిలబడ్డారు.

మది మదిలో మరియమాత



విశ్వాస శిఖరం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతోంది. వేలాదిగా తరలివస్తున్న భక్తజనం మదిమదిలో మరియ మాతను నింపుకొని మనసారా ప్రణమిల్లుతోంది. మొక్కుబడులు చెల్లిస్తూ.. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటూ.. దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరిస్తూ దీవెనలు పొందుకుంటోంది. మేరీమాత తిరునాళ్ల రెండో రోజు సోమవారం రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో గుణదల పుణ్యక్షేత్రం కిక్కిరిసింది. ఉత్సాహపరిచే పాటలు.. మనోనేత్రాన్ని వెలిగించే ప్రసంగాలు.. గురువుల సమష్టి దివ్యపూజాబలి, కనువిందు చేసే సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు తన్మయత్వానికి గురిచేస్తున్నాయి.

- రెండో రోజు కొనసాగిన మేరీమాత తిరునాళ్ల
- సమష్టి దివ్యబలిపూజ సమర్పించిన ఖమ్మం కథోలిక పీఠాధిపతి ప్రకాష్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గుణదల(విజయవాడ తూర్పు): నూరు వసంతాలుగా గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం భక్తి విశ్వాసాలకు కేంద్రంగా, పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోందని ఖమ్మం కథోలిక పీఠాధిపతి సగిలి ప్రకాష్ అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న ఉత్సవాల రెండో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ దైవ కుమారుడైన ఏసుక్రీస్తు ద్వారా ఈ లోకానికి రక్షణ చేకూరిందని తెలిపారు. మానవాళి రక్షణ ప్రణాళికలో భాగంగా మరియ గర్భవాసాన లోక రక్షకుడు జన్మించారని గుర్తు చేశారు. మరియతల్లి పవిత్రతను బట్టి దేవుడు ఆమెను తన తల్లిగా ఎన్నుకున్నారన్నారు. మరియతల్లి లోకమాతగా కీర్తి నొందుతోందని పేర్కొన్నారు.



మరియతల్లి దీవెనలతో..

అనంతరం విజయవాడ బిషప్ తెలగతోటి రాజారావు మాట్లాడుతూ, మరియతల్లిపై భక్తులకు అమితమైన విశ్వాసం ఉండబట్టే మేరీమాత పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందని తెలిపారు. ఉత్సవాలు సమర్థంగా జరుగుతున్నాయంటే మరియతల్లి దీవెనలే కారణమని వివరించారు. మరియమ్మను ఆశ్రయించి భక్తులందరూ దీవెనలు పొందాలని కాంక్షించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ ఏలేటి విలియం జయరాజు, వికార్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పలు విచారణల గురువులు పాల్గొన్నారు.